క్లుప్తంగా

శ్మశానవాటిక పరిశీలన



కిలేశపురం(ఇబ్రహీంపట్నం): కిలేశపురం హిందూ శ్మశాన వాటికను ఎన్టీటీపీఎస్ అధికారులు సోమవారం పరిశీలించారు. ఇటీవల కాలంలో ఎన్టీటీపీఎస్ ఆధ్వర్యాన గ్రామంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరంలో వైస్ ఎంపీపీ బాణావత్ నాగబాలమ్మ, పలువురు గ్రామస్తులు శ్మశానవాటికకు ప్రహరీతో పాటు పలు సమస్యలను ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్, సంస్థ చీఫ్ ఇంజినీర్ టి.నాగరాజు దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై స్పందించిన సంస్థ డీఈ హరినారాయణరెడ్డి, ఏఈ ఆర్డీవీ ప్రసాద్, సర్పంచి కాకి దేవమాతతో కలసి శ్మశాన వాటిక పరిశీలించారు. సర్వే నిర్వహించిన అనంతరం సమస్యలపై దృష్టి సారిస్తామని హామీ ఇచ్చారు. గొర్రెని గాంధీ, బాణావత్ బాలాజీ, కాకి రాఘవ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు భద్రత నియమాలు పాటించాలి




తిరువూరు: వాహనచోదకులు రహదారి భద్రత నియమాలు పాటించాలని తిరువూరు ఎస్ఐ సత్యనారాయణ సూచించారు. స్థానిక వాహిని ఇంజినీరింగ్ కళాశాలలో సోమవారం కేంద్ర యువజన వ్యవహారాలు, క్రీడా మంత్రిత్వ శాఖ, నెహ్రూ యువకేంద్రం, రవాణా శాఖ సంయుక్త ఆధ్వర్యంలో జిల్లా స్థాయి ట్రాఫిక్ అవగాహన కార్యక్రమాన్ని ప్రారంభించారు. వాహనచోదకులు అప్రమత్తంగా ఉండాలని, సెల్‌ఫోన్ మాట్లాడుతూ, మద్యం సేవించి వాహనం నడిపితే ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని ఎస్ఐ సూచించారు. ద్విచక్రవాహనచోదకులు హెల్మెట్ తప్పక ధరించాలని, అతి వేగం అనర్థమని ఎస్ఐ వెల్లడించారు. ట్రాఫిక్ అవగాహన కార్యక్రమాల్లో పాల్గొన్న విద్యార్థులకు టీషర్టులు, టోపీలు అందజేశారు. వాహిని పాలిటెక్నిక్ కాలేజీ ప్రిన్సిపాల్ వై.కృష్ణ, నెహ్రూ యువ కేంద్రం వలంటీర్లు బాబు, అభిషేక్ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలకు బీరువా బహూకరణ



మైలవరం: గణపవరం గ్రామానికి చెందిన మంగునూరి భోజేశ్వరరెడ్డి పుట్టిన రోజు పురస్కరించుకుని అతని తండ్రి మంగునూరి భద్రారెడ్డి తన కుమారుడు చదువుతున్న గ్రామంలోని ఎంపీయూపీ స్కూల్‌కు ఇనుప బీరువాను సోమవారం బహూకరించారు. మంగునూరి భోజేశ్వరరెడ్డి ఎంపీయూపీ స్కూల్‌లో ఐదో తరగతి విద్యార్థి. ఈ సందర్భంగా పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది భద్రారెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు ఓం ప్రకాష్, ఉపాధ్యాయులు అబ్దుల్ ఖాదర్, శ్రీనివాసరావు, ముత్తయ్య, అనసూయాదేవి తదితరులు పాల్గొన్నారు.

శివాలయం నిర్మాణానికి రూ.5 లక్షల విరాళం



మైలవరం: అనంతవరం గ్రామంలో నిర్మిస్తున్న శివాలయానికి దాత ప్రవాసాంధ్రులు కోమటి జయరామ్, ఆయన సోదరుడు కోమటి సుధాకరరావు రూ.5 లక్షల విరాళాన్ని సోమవారం ఆలయ నిర్మాణ కమిటీ సభ్యులకు అందజేశారు. శ్రీలక్ష్మీ స్టోన్ క్రషర్ యజమాని యలమంచిలి వెంకటరత్నం రూ.2.50 లక్షలు అందజేశారు. దాతలకు ఆలయ కమిటీ సభ్యులు శాలువాలు కప్పి సత్కరించారు. కార్యక్రమంలో చనమోలు రాజశేఖర్, బొందలపాటి సుధాకరరావు, బూదేటి రామారావు, గ్రామ పెద్దలు జొన్నలగడ్డ అప్పారావు, పమిడి సూర్య ప్రకాశ్‌రావు, కోడె శ్రీనివాసరావు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఆరోగ్యశ్రీ పేరుతో మోసం

తిరువూరు: 'మీరు ఇంతవరకు ఆరోగ్యశ్రీ పథకం ద్వారా ఎటువంటి లబ్ధి పొందనందున మీకు ప్రభుత్వం నుంచి రూ.22 వేలు ఆర్థిక ప్రోత్సాహం అందిస్తున్నామం' అంటూ తిరువూరు మండలంలోని కోకిలంపాడుకు చెందిన ఒక మహిళను కేటుగాళ్లు మోసగించిన ఘటన సోమవారం చోటుచేసుకుంది. ఆరోగ్యశ్రీలో మీరు లబ్ధి పొందారా, లేకపోతే నగదు ప్రోత్సాహం రూ.22వేలు వస్తాయని నమ్మబలికి ఆ మహిళ ఫోన్ పే నుంచి తమ యూపీఐ స్కానర్‌కు రూ.5వేలు నగదు బదిలీ చేయించుకున్నారు. తాను మోసపోయినట్లు గ్రహించిన మహిళ కాల్ చేసిన నంబర్‌కు ఎన్నిసార్లు ప్రయత్నించినా ప్రయోజనం లేకపోవడంతో తిరువూరు పోలీసులను ఆశ్రయించారు. సైబర్ క్రైం పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయాలని తిరువూరు ఎస్ఐ సత్యనారాయణ సూచించారు.

'కనిమెర్ల'.. కనికరించరూ..

- రక్షణగోడ నిర్మించండి మహాప్రభో
- కాకర్ల వాగుకు 'గోడ' నిర్మించాలని గ్రామస్తుల విజ్ఞప్తి
- భారీ వర్షాలు కురిస్తే కట్టలు కోతకు గురై గ్రామంలోకి వరదనీరు
- నాడు వైఎస్సార్ హయాంలో కొంతమేర వాల్ నిర్మాణం



కనిమెర్ల గ్రామం ఓవర్ వ్యూ

జి.కొండూరు: కాకర్ల వాగు వద్ద రక్షణ గోడ నిర్మించాలని మైలవరం మండల పరిధిలోని కనిమెర్ల గ్రామస్తులు విజ్ఞప్తి చేస్తున్నారు. కనిమెర్ల గ్రామ శివారులోని కొండల నుంచి వచ్చే వరద నీటి ప్రభావంతో సహజ సిద్ధంగా ఏర్పడిన కాకర్ల వాగు ఆ గ్రామానికి నివురుగప్పిన నిప్పులా మారింది. కనిమెర్లకు ఆనుకొని ఉన్న ఈ వాగు కొద్దిపాటి వర్షాలకే ఉధృతంగా ప్రవహిస్తూ ఉంటుంది. అలాంటిది భారీ వర్షాలు పడితే వాగు ఉగ్రరూపాన్ని ప్రదర్శించి గ్రామస్తులను కంటిమీద కునుకులేకుండా చేస్తుంటుంది. వాగు పొంగి కట్టలు కోతకు గురైతే గ్రామంతో పాటు సాగు భూములు సైతం నీట మునిగి ఆ ప్రాంతం నామరూపాల్లేకుండా పోయే అవకాశం ఉంది. ప్రభుత్వం, ప్రజాప్రతినిధులు స్పందించి గ్రామ పరిధిలో ఉన్న వాగుకు రెండు వైపులా రిటైనింగ్ వాల్ నిర్మించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

కనిమెర్ల గ్రామ సమాచారం	
గ్రామ విస్తీర్ణం	11.13ఎకరాలు
వ్యవసాయ భూమి	381ఎకరాలు
జనాభా	531
పురుషులు	267
స్త్రీలు	264
ఇళ్లు	103
రేషన్ కార్డులు	142

ఇటీవల వరదలకు భారీగా నష్టం

గత ఏడాది ఆగస్టులో కురిసిన భారీ వర్షాలకు కొండల్లో నుంచి వచ్చిన వరద ప్రవాహానికి కాకర్ల వాగు ఉగ్రరూపాన్ని ప్రదర్శించింది. వాగు కట్టలు కోతకు గురై వరదనీరు గ్రామంలోకి చేరడంతో పాటు వాగు పరివాహక ప్రాంతంలో ఉన్న 381 ఎకరాల్లో సాగు భూమి నీట మునిగి రైతులు తీవ్రంగా నష్టపోయారు. మామిడితోటల్లో సాగు చేస్తున్న మినుము, పత్తి, కూరగాయ పంటలను రైతులు నష్టపోయారు. నష్టపోయిన రైతులకు పరిహారం కూడా అందలేదని తెలుస్తుంది.

వైఎస్సార్ హయాంలో రక్షణ చర్యలు

కాకర్ల వాగుతో కనిమెర్ల గ్రామానికి ముప్పుతప్పదని భావించిన నాటి ప్రజా ప్రతినిధులు, అధికారుల వినతి మేరకు 2004–09 మధ్యకాలంలో నాటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో వాగుకు రిటైనింగ్‌వాల్ నిర్మాణానికి శ్రీకారం చుట్టి కొంతమేర నిర్మాణం పూర్తి చేశారు. ఆ తర్వాత ఆయన మరణాంతరం వాల్ నిర్మాణ పరిధి పెంపు పనులకు బ్రేక్ పడింది. ఆ తర్వాత ఎవరూ రిటైనింగ్ వాల్ నిర్మాణంపై దృష్టి సారించలేదు. గత ప్రభుత్వంలో వాల్ నిర్మాణం చేపట్టాలంటూ గ్రామస్తులు నాటి ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్ దృష్టికి తీసుకెళ్లినా ఆయన దీనిపై ఆసక్తి చూపలేదని తెలుస్తోంది.



కనిమెర్లకు ఆనుకొని కాకర్ల వాగులో వైఎస్సార్ హయాంలో నిర్మించిన 'వాల్'లో కొంత భాగం



కాకర్ల వాగు పొంగి కనిమెర్లలోకి వరదనీరు వచ్చిన ప్రదేశం ఇదే..

వానలు పడితే రాత్రిళ్లు ఆందోళనే



భారీ వర్షాలు కురిసే సమయంలో మా గ్రామస్తులకు రాత్రిళ్లు ఆందోళనే. కాకర్ల వాగు పొంగితే గ్రామంలో కొన్ని ఇళ్లు కొట్టుకుపోతాయి. వాగుకు రిటైనింగ్ వాల్‌ను నిర్మించాలి. గతంలో నిర్మించిన గోడను ఎత్తు కూడా పెంచాలి.

–బాణావతు బాలు, కనిమెర్ల

పంటలు తీవ్రంగా నష్టపోయాం



కాకర్ల వాగుకు ఇటీవల వచ్చిన వరద ప్రవాహానికి వాగు కట్టలు కోతకు గురై గ్రామంతో పాటు మా పంట భూములు వరద ముంపునకు గురయ్యాయి. మినుము, పత్తి, కూరగాయ పంటలకు తీవ్ర నష్టం జరిగింది. గ్రామ పరిధిలో వాగుకు రెండు వైపులా ఎత్తైన గోడ నిర్మించాలి.

–లావుడియా రాము, రైతు, కనిమెర్ల

వరద ముంపు నుంచి గ్రామాన్ని కాపాడాలి



మా గ్రామాన్ని కాకర్ల వాగు వరద నుంచి కాపాడాలంటే వాగుకు రెండు వైపులా రిటైనింగ్ వాల్ నిర్మించాలి. గత వైఎస్సార్ హయాంలో కొంత మేర గోడను నిర్మించారు. ఆ తర్వాత ప్రభుత్వాలు పట్టించుకోలేదు. ఇటీవల వరదలకు తీవ్రంగా నష్టపోయాం. ఇకనైనా ప్రభుత్వం స్పందించి గోడను నిర్మించాలి.

–లావుడియా శ్రీనివాసరావు, సర్పంచ్, కనిమెర్ల

నేటి నుంచి ఆధార్ నమోదు క్యాంపులు

ఇబ్రహీంపట్నం: ప్రత్యేక ఆధార్ నమోదు క్యాంపులు మండలంలోని 10 గ్రామ సచివాలయాల పరిధిలో మంగళవారం నుంచి శుక్రవారం వరకు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో సునీతశర్మ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. దాములూరు, చిలుకూరు, కాచవరం, త్రిలోచనాపురం, కేతనకొండ, కొటికలపూడి, మూలపాడు, జూపూడి, తుమ్మలపాలెం, గుంటుపల్లి గ్రామాల్లోని అంగన్‌వాడీల పరిధిలో పెండింగ్‌లో ఉన్న ఆధార్‌లను గ్రామ పంచాయతీ కార్యదర్శులు ముందుగా గుర్తించాలని పేర్కొన్నారు. ఆధార్ నమోదై ఐదేళ్లు అయిన చిన్నారులు అప్‌డేట్ చేసుకోవాలని సూచించారు

ఇచ్చిన హామీలను 'కూటమి' నెరవేర్చాలి



మైలవరం: ఎన్నికల సందర్భంగా కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చాలని ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు, సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సీహెచ్ కోటేశ్వరరావు డిమాండ్ చేశారు. సీపీఐ వ్యవసాయ కార్మిక సంఘాలు ఇచ్చిన పిలుపు మేరకు ప్రజా సమస్యల పరిష్కార వేదికను పురస్కరించుకుని జి. కొండూరు మండల సీపీఐ, వ్యవసాయ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో పెద్ద సంఖ్యలో తహసీల్దార్ కార్యాలయం వద్ద సోమవారం ఆందోళన చేశారు. తహసీల్దార్ చాట్ల వెంకటేశ్వరరావుకు వ్యక్తిగత అర్జీలు అందజేశారు. ఈ సందర్భంగా కోటేశ్వరరావు మాట్లాడుతూ రెండు రోజుల క్రితం జరిగిన కేబినెట్ నిర్ణయం ప్రకారం పేదలకు సొంత ఇల్లు ఏర్పాటుకు సత్వర చర్యలు తీసుకోవాలన్నారు. అర్హులకు కనీసం మూడు సెంట్లు స్థలం ఇచ్చి ఇల్లు కట్టుకోవడానికి రూ. ఐదు లక్షలు ఇవ్వాలని తెలిపారు. కార్యక్రమంలో జి.కొండూరు మండల సీపీఐ కార్యదర్శి గూడూరు శ్రీనివాసరెడ్డి, తిరుపతి జమలయ్య, ఎస్కే జిలానీ, ఎస్.లక్ష్మి పాల్గొన్నారు.

పశు వైద్య శిబిరాలను వినియోగించుకోండి

దాములూరు(ఇబ్రహీంపట్నం): జిల్లాలో నిర్వహిస్తున్న పశువైద్య శిబిరాలను పాడి రైతులు వినియోగించుకోవాలని పశుసంవర్థక శాఖ జిల్లా అధికారి డాక్టర్ హనుమంతరావు కోరారు. దాములూరులో ఆ శాఖ ఆధ్వర్యాన ఏర్పాటు చేసిన ఉచిత పశువైద్య శిబిరాన్ని సోమవారం ఆయన ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా ఈ నెల 20 నుంచి 31వ తేదీ వరకు జాతీయ పశు వ్యాధి నియంత్రణ పథకం ద్వారా పశువైద్య శిబిరాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. నందిగామ ఉప సంచాలకుడు జాన్‌వెస్లీ, ఇబ్రహీంపట్నం సహాయ సంచాలకుడు రాధాకృష్ణమూర్తి, పశు వైద్యాధికారి శైలుమాధురి, సర్పంచి చెరుకుమల్లి మధుసూదనరావు, తదితరులు పాల్గొన్నారు.

తిరువూరు: చింతలపాడులో సోమవారం పశువులకు చూడి పరీక్షలు, ఎదకు రాని పశువులకు చికిత్స చేసి అవసరమైన మందులు పంపిణీ చేశారు. గొర్రెలు, మేకలకు నట్టల మందు పంపిణీ చేశారు. పశువైద్యాధికారి డాక్టర్ స్వప్న, పశు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



దాములూరులో పశు వైద్య శిబిరం

ముసునూరు: పశువుల్లో సంభవించే వ్యాధుల నివారణ పట్ల పశు పోషకులు జాగ్రత్త వహించాలని మండల పశు వైద్యాధికారి ఎం.వెంకట చైతన్య అన్నారు.

మండలంలోని కాట్రేనిపాడు, రమణక్కపేట గ్రామాల్లో సోమవారం పశు సంవర్థకశాఖ ఆధ్వర్యంలో పశు వైద్య శిబిరాలు నిర్వహించారు. వైద్య బృందం 95 గేదెలకు గర్భకోశ వ్యాధుల పరీక్షలు చేశారు. కార్యక్రమాల్లో గద్దల మోహనరావు, బాలకృష్ణ, అంజియ్య తదితరులు పాల్గొన్నారు.

సైన్స్ ప్రయోగాల కరపత్రాల ఆవిష్కరణ

కొండపల్లి(ఇబ్రహీంపట్నం): రాష్ట్ర స్థాయి సైన్స్ ప్రయోగాల కరపత్రాలను జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో కొండపల్లి మోహనరావు మెమోరియల్ వైద్యశాలలో సోమవారం ఆవిష్కరించారు. ముఖ్య అతిథులుగా డాక్టర్ సీతారామారావు, జేవీవీ జిల్లా అధ్యక్షుడు వి.మురళీమోహన్ పాల్గొన్నారు. జేవీవీ ఆధ్వర్యంలో రాష్ట్రంలో చేపట్టిన వివిధ కార్యక్రమాలను వారు వివరించారు. ఫిబ్రవరి 28 సైన్స్ దినోత్సవం పురస్కరించుకుని నేటి బాలలను రేపటి శాస్త్రవేత్తలుగా ప్రోత్సహించడానికి సైన్స్ నైపుణ్యాలపై ప్రయోగాల పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సైన్స్ టెక్నాలజీ, పర్యావరణం– సుస్థిర అభివృద్ధి, మూఢనమ్మకాలు–శాస్త్రీయ దృక్పథం అంశాలపై చేసిన ప్రయోగాల వీడియోలు పంపాలని కోరారు. పూర్తి వివరాలకు 93985 24988 నంబర్‌లో సంప్రదించాలన్నారు. జేవీవీ జిల్లా ఉపాధ్యక్షుడు కామేశ్వరరావు, సభ్యులు నాగరాజు, సర్ధార్‌సాహెబ్, చేతన్‌మురళీ, డేవిడ్‌రాజు తదితరులు పాల్గొన్నారు.



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న జేవీవీ జిల్లా అధ్యక్షుడు మురళీమోహన్, సీతారామారావు తదితరులు

చిన్నారికి ఆర్థిక సాయం

ఎస్టీయూ నాయకుల ఔదార్యం

ఆగిరిపల్లి: తలసేమియా వ్యాధితో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న చిన్నారికి మండలంలోని ఎస్టీయూ ఉపాధ్యాయ సంఘం నాయకులు వైద్య ఖర్చుల నిమిత్తం ఆర్థిక సాయం అందజేశారు. మండలంలోని ఈదుల గూడెంలో మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ఐదో తరగతి విద్యార్థిని షేక్ రఫీ బేగం తలసీమియా వ్యాధితో బాధపడుతూ ఈ నెల 16న తీవ్ర అనారోగ్యంతో విజయవాడలోని ప్రైవేట్ ఆస్పత్రిలో వెంటిలేటర్‌పై చికిత్స పొందుతోంది. విద్యార్థిని తల్లి పాఠశాలలో ఆయాగా పని చేస్తుంది. ఆమె తల్లి వైద్య ఖర్చులు భరించలేని దీన స్థితిలో ఉండగా అదే పాఠశాలలో ఉపాధ్యాయుడు, ఎస్టీయూ శాఖ మండల ఆర్థిక కార్యదర్శి అంకం వెంకటేశ్వరావు సంఘం మండల శాఖ వాట్సాప్ గ్రూపులో విద్యార్థిని వైద్య వివరాలు పెట్టగా దానికి స్పందించి ఉపాధ్యాయ సంఘం నాయకుల ఆధ్వర్యంలో రూ.1,14,612 విరాళాలు సేకరించారు. ఆగిరిపల్లి మండల ఎస్టీయూ నాయకులు సురేష్ కుమార్, తాడి నరసింహారావు, విజయ్ కుమార్, అబ్దుల్ హక్, అంకం వెంకటేశ్వరరావు, వేణుగోపాలరావు చికిత్స పొందుతున్న విద్యార్థిని తల్లి షేక్ లాల్‌బీకి డబ్బును అందజేశారు. విద్యాశాఖ అధికారులు సర్వేశ్వరరావు, ఆనంద్‌కుమార్, ఎస్టీయూ మండల నేతలను అభినందించారు.



విద్యార్థిని తల్లికి ఆర్థికసాయం అందజేస్తున్న ఎస్టీయూ ఉపాధ్యాయ సంఘ నాయకులు

సారా తయారీ కేంద్రాలపై దాడులు

చాట్రాయి: సారా తయారీ కేంద్రాలపై దాడి చేసినట్లు నూజివీడు ఎక్సైజ్ ఎస్సై మస్తానరావు తెలిపారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మండలంలోని పోతనపల్లి తండాలో సారా తయారు చేస్తున్నారని సమాచారం రావడంతో దాడి చేసి పది లీటర్ల సారాను స్వాధీనం చేసుకుని 500 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేసినట్లు ఆయన చెప్పారు. సారా తయారీదారుడు దారావతు శ్రీరాములుపై కేసు నమోదు చేశామని తెలిపారు.

మిర్చి పంటకు సస్యరక్షణ చర్యలు

ముసునూరు: మిర్చి పంటను ఆశించే నల్లి, తామర తెగుళ్ల నివారణకు తక్షణ సస్య రక్షణ చర్యలు చేపట్టాలని ఉద్యాన శాఖ ఏలూరు శాస్త్రవేత్త డాక్టర్ ఫణి కుమార్ సూచించారు. మండల ఉద్యాన శాఖాధికారి జ్యోతి ప్రియాంక ఆధ్వర్యంలో వలసపల్లిలో సాగవుతున్న మిర్చి పంటలను రైతులు, సిబ్బందితో కలిసి సోమవారం పరిశీలించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి చినసూరిబాబు, రైతుసేవా కేంద్ర సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

అర్జీల పరిష్కారంలో నాణ్యత ఉండాలి

నూజివీడు: ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వచ్చిన అర్జీలను గడువులోగా నాణ్యతతో పరిష్కరించాలని సబ్‌కలెక్టర్ బచ్చు స్మరణ్‌రాజ్ పేర్కొన్నారు. స్థానిక సబ్‌కలెక్టర్ కార్యాలయంలో సోమవారం ఆయన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (మీకోసం)ను నిర్వహించారు. ప్రజల నుంచి 26 అర్జీలు రాగా వాటిలో రెండు అర్జీలను అక్కడికక్కడే పరిష్కరించారు. మిగిలిన అర్జీలను పరిష్కార నిమిత్తం సంబంధిత అధికారులకు పంపారు. ఈ సందర్భంగా సబ్‌కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రజా సమస్యల పరిష్కారానికి ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తోందన్నారు. అర్జీల పరిష్కారంలో నిర్లక్ష్యంగా వ్యవహరించొద్దన్నారు. కార్యక్రమంలో ఏడీఏ జి.విద్యాసాగర్, డీఎల్‌డీఓ వెంకటరత్నం, డీఎల్‌పీఓ ఎంపీఎస్ సుందరి, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ చిలుకూరు భాస్కరరెడ్డి, హెచ్‌ఓ హేమ, తదితరులు పాల్గొన్నారు.



ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న సబ్‌కలెక్టర్ బచ్చు స్మరణ్‌రాజ్

ముఖ్యమైన అర్జీలు ఇలా..

- తమ గ్రామంలో భూముల రీసర్వే నిర్వహిస్తుండటంతో రిజిస్ట్రేషన్లను నిలిపివేశారని, దీంతో తాము పంట రుణాలు, స్వల్ప కాలిక, దీర్ఘ కాలిక రుణాలు తీసుకోవాలంటే వీలుపడటం లేదని, నెల రోజులుగా ఇదే పరిస్థితి ఉండటంతో రబీలో సాగు చేసిన పంటలకు పెట్టుబడులు పెట్టాలంటే బయట అధిక వడ్డీలకు అప్పులు చేయాల్సి వస్తుందన్నారు. రిజిస్ట్రేషన్లను పునరుద్ధరించాలని కోరుతూ ముసునూరు మండలం బలివే శివారు వెంకటాపురానికి చెందిన సన్న, చిన్నకారు రైతులు అర్జీని అందజేశారు.
- బత్తులవారిగూడెంకు చెందిన గుగులోతు వెంకటేశ్వరరావుతో వివాహమై 27 ఏళ్లు అయిందని, భర్త కొంత కాలంగా వ్యసనాలకు బానిసై రోజూ శారీరకంగా, మానసికంగా వేధిస్తున్నాడని, కూలి పనులకు వెళ్లగా వచ్చిన డబ్బులను సైతం కొట్టి లాక్కెళుతున్నాడని, దీనిపై గతంలోనే కేసు పెట్టినా పోలీసులు పట్టించుకోవడం లేదని, తనకు న్యాయం చేయాలని కోరుతూ గుగులోతు జమున అర్జీ అందజేసింది.

కొత్త ఈదరలో మట్టి దందాపై ఫిర్యాదు

ఆగిరిపల్లి: కొత్త ఈదరలో సర్పంచ్, ఎంపీటీసీ భర్త చేస్తున్న మట్టి దందాపై వెంటనే చర్యలు తీసుకోవాలని మాజీ సర్పంచ్ పోలిశెట్టి సత్యనారాయణ సోమవారం తహసీల్దార్ పీఎస్వీ ప్రసాద్‌కు ఫిర్యాదు చేశారు. కొత్త ఈదర గ్రామంలోని చెరువులోని మట్టిని సర్పంచ్ బెక్కం రాజగోపాలరావు ఆర్ఎస్ నంబర్ 408లో సుమారు ఐదు వేల ట్రక్కుల మట్టిని నిలువ చేశారని, ఇప్పుడు ఆ మట్టిని ఇటుక బట్టీలకు రూ.40 లక్షల రూపాయలకు బేరం పెట్టారని ఆరోపించారు. ఎంపీటీసీ భర్త బెక్కం శ్రీనివాసరావు ఆర్ఎస్ నంబర్ 561/2లో ఐదు వేల ట్రక్కుల మట్టిని నిల్వ ఉంచి ఇటుక బట్టీలకు బేరం పెట్టారని ఫిర్యాదుదారుడు తెలిపారు.

కొత్త ఈదర మాలగట్టులో అక్రమ మైనింగ్ చేస్తూ ప్రభుత్వానికి రావలసిన ఆదాయానికి సర్పంచ్, ఎంపీటీసీ భర్త గండి కొడుతున్నారని ఆరోపించారు. ఆర్ ఎస్ నంబర్ 374/5లో ప్రభుత్వ భూమిని ఎంపీటీసీ భర్త ఆక్రమించి ఇల్లు నిర్మించుకున్నారని, సర్పంచ్ బెక్కం రాజగోపాల్ అదే సర్వే నంబర్‌లో అక్రమంగా కొంత మందికి ఇళ్ల స్థలాలు కూడా అమ్మారన్నారు. శ్రీనివాసరావు కొత్త ఈదరలోని శ్రీదాసాంజనేయస్వామి గుడికి సంబంధించి దేవుడి మాన్యం ఆర్ఎస్ నంబర్ 437/3లో ఎకరం రెండు సెంట్లను అక్రమంగా ఆక్రమించి పట్టాదారు పాస్ పుస్తకాలు కూడా తెచ్చుకున్నారని ఆరోపించారు. వారి అక్రమాలను నిలదీస్తున్న నాపై తప్పుడు కేసులు పెట్టాలని చూస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కొత్త ఈదర గ్రామంలో జరుగుతున్న అక్రమ మైనింగ్, ప్రభుత్వ, దేవుడి భూమి ఆక్రమణలపై సోమవారం తహసీల్దార్ ప్రసాద్‌కు సత్యనారాయణ ఫిర్యాదు చేశారు. తహసీల్దార్ ప్రసాద్ మాట్లాడుతూ ఫిర్యాదుపై విచారణ చేసి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

సీసీ కెమెరాలు ఏర్పాటు చేయండి

విస్సన్నపేట: దుకాణదారులు ముందస్తు జాగ్రత్తగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సహాయ పోలీస్ కమిషనర్ ప్రసాదరావు సూచించారు. విస్సన్నపేట పోలీసుస్టేషన్లో సోమవారం దుకాణదారులకు సమావేశం నిర్వహించిన ఏసీపీ మాట్లాడుతూ నేరాల నియంత్రణకు సీసీ కెమెరాల ఏర్పాటు ముఖ్యమన్నారు. దుకాణాలకు ఎవరైనా అనుమానితులు వచ్చినట్లయితే సమాచారం అందించాలని సూచించారు. తిరువూరు సీఐ గిరిబాబు, విస్సన్నపేట ఎస్ఐ రామకృష్ణ పాల్గొన్నారు.

పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం

మైలవరం: పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారని సీడీపీఓ కె.పుష్పలత తెలిపారు. మైలవరం ఐసీడీఎస్ కార్యాలయంలో సోమవారం గర్భిణులకు సామూహిక సీమంతం కార్యక్రమం జరిగింది. సీడీపీఓ మాట్లాడుతూ గర్భవతి అయినప్పటి నుంచి పుట్టిన బిడ్డకు రెండేళ్లు నిండేవరకు ఉన్న మధ్య కాలాన్ని వెయ్యి రోజుల సంరక్షణగా పరిగణిస్తామన్నారు. కార్యక్రమంలో గర్భిణులు, బాలింతలు పాల్గొన్నారు.

హెల్మెట్, డ్రైవింగ్ లైసెన్స్ లేని బైక్‌ల స్వాధీనం

మైలవరం: డ్రైవింగ్ లైసెన్స్, హెల్మెట్ లేకుండా వాహనాలు నడుపుతున్న బాలురను, ట్రిపుల్ రైడ్ చేస్తూ బైక్ నడుపుతున్న బాలురకు కౌన్సిలింగ్ ఇచ్చి 20 వాహనాలు సీజ్ చేసినట్లు మైలవరం సీఐ దాడి చంద్రశేఖర్ సోమవారం తెలిపారు. బాలురకు, వారి తల్లిదండ్రులు బైక్ ఇస్తే వారిపై బైక్ ఓనర్స్‌పై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని సీఐ చంద్రశేఖర్ హెచ్చరించారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

ముసునూరు: గడ్డి మందు తాగి, ఆస్పత్రి పాలైన వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్సై ఎం.చిరంజీవి తెలిపారు. ముసునూరులోని బడుగువారిగూడేనికి చెందిన కొలికిపాము చంటిబాబు (35) కూలి పనులు చేస్తుండేవాడు. కుటుంబ కలహాల నేపథ్యంలో ఈ నెల 9న గడ్డి మందును తాగాడు. బంధువులు అతడిని నూజివీడు ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం అక్కడి నుంచి విజయవాడ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ సోమవారం తెల్లవారు జామున మృతి చెందినట్లు తెలిపారు. ఆస్పత్రి నుంచి వచ్చిన సమాచారంతో కేసు నమోదు చేసి, మృతదేహానికి పోస్టుమార్టం అనంతరం బంధువులకు అప్పగించినట్లు ఎస్సై పేర్కొన్నారు.